క్లుప్తంగా

పౌష్టికాహారంతో గర్భిణులకు ఆరోగ్యం



పౌష్టికాహారం అందుకున్న గర్భిణులతో ఆశ్రమం కమిటీ సభ్యులు

వేటపాలెం: గర్భిణులు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలని సీడీపీవో ఝాన్సీ పేర్కొన్నారు. దేశాయిపేట నీలకంఠాపురంలో గల అనాథ వృద్ధ శరణాయంలో పేద గర్భిణులకు పౌష్టికాహారం శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ గర్భిణులు చిన్నచిన్న వ్యాయామాలు చేయాలని సూచించారు. నెలనెలా డాక్టర్లను సంప్రదిస్తూ, ఆశా, ఆరోగ్య శాఖ అందించే సూచనలు పాటించాలని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందజేసే పౌష్టికాహారాన్ని క్రమం తప్పకుండా తీసుకోవాలన్నారు. అనంతరం గర్భిణులకు పౌష్టికాహార కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పుష్పవల్లి, లీలావతి ఆశ్రమ కన్వీనర్ సత్రం మల్లేశ్వరరావు, అధ్యక్షుడు గుత్తి విశ్వేశ్వరరావు, ఆశ్రమ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

దగ్గుబాడులో శనగల కొనుగోలు కేంద్రం



శనగల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏఓ, నాయకులు

సాక్షి ఎఫెక్ట్..

దగ్గుబాడు (కారంచేడు): శనగ రైతుకు ప్రభుత్వం సరైన గిట్టుబాటు ధర కల్పించడం లేదని పత్రికల్లో వస్తే కాని కూటమి నాయకులు, అధికారులు స్పందించడం లేదు. ఈనెల 8వ తేదీన 'శనగ రైతులు.. లబోదిబో' శీర్షికన సాక్షిలో కథనాన్ని ప్రచురించింది. వెంటనే బాపట్ల జాయింట్ కలెక్టర్ ప్రకర్‌జైన్, జిల్లా వ్యవసాయాధికారి వై రామకృష్ణలు గ్రామాల్లో శనగల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జేసీ ఆదేశాలతో శుక్రవారం మండలంలోని దగ్గుబాడు, నాయుడు వారిపాలెం గ్రామాల్లో ఆయా గ్రామాల పీఏసీఎస్‌ల ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని ఏఓ కే సుధీర్‌బాబు తెలిపారు. శనగ పంటకు ప్రభుత్వం రూ.5650 గిట్టుబాటు ధరగా నిర్ణయించిందన్నారు. 12 శాతం తేమ, 2 శాతం వ్యర్థాలు ఉండాలని ఏఓ తెలిపారు. అమ్మదలచిన పంటలను పీఏసీఎస్‌ల వద్దకు చేర్చాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

గాయత్రి పరివార్ శక్తిపీఠం నిర్మాణానికి విరాళం



శక్తిపీఠం ప్రతినిధులకు విరాళం అందిస్తున్న దాత, వాకర్స్ సభ్యులు

చీరాల రూరల్: శక్తిపీఠం భవన నిర్మాణానికి దాతలు విరాళం అందించారు. వాకర్స్ ఇంటర్నేషనల్ ఎస్ఆర్అండ్‌సీఎం హైస్కూల్ వాకర్స్ అసోసియేషన్ సభ్యుడు చెక్క చెన్ననారాయణ శుక్రవారం హైస్కూలు క్రీడా మైదానంలో పీఠం చీరాల శాఖ ఇన్‌చార్జ్ దివ్వెల వెంకట రాధాకృష్ణమూర్తికి వాకర్స్ సమక్షంలో రూ. 1 లక్ష విరాళం అందించారు. ఈసందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు పోలుదాసు రామకృష్ణ మాట్లాడుతూ గుంటూరు సమీపంలోని నారా కోడూరులో రెండున్నర ఎకరాల్లో గాయత్రి పరివార్ శక్తిపీఠం భవన నిర్మాణం, కళ్యాణ మండపం, ప్రవచన హాలు నిర్మాణం జరుగుతుందని చెప్పారు. వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలతో పాటు ఆధ్యాత్మిక నిర్మాణాలకు తమ సభ్యులు విరాళాలు అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వాకర్స్ సభ్యులు చారుగుళ్ల గురుప్రసాద్, చెక్క చెన్ననారాయణ, కారుమూరి జనార్దనరావు, వలివేటి మురళీకృష్ణ వాకింగ్ సభ్యులు పాల్గొన్నారు.

డ్వాక్రా ఉత్పత్తులు ఆన్‌లైన్ మార్కెటింగ్ చేయాలి



మాట్లాడుతున్న డీపీఎం రవీంద్ర

అద్దంకి రూరల్: తయారు చేసిన ఉత్పత్తులను ఆన్‌లైన్ ద్వారా మార్కెటింగ్ చేయడంపై డ్వాక్రా గ్రూపుల సంఘాల మహిళలు అవగాహన పెంపొందించుకోవాలని డీపీఎం ఎల్‌హెచ్ కే రవీంద్ర అన్నారు. శుక్రవారం స్థానిక వెలుగు కార్యాలయంలో నియోజకవర్గంలోని అద్దంకి, బల్లికురవ, సంతమాగులూరు, మండలాలకు సంబంధించి వీవోఏ, వినియోగదారులకు, ఆన్‌లైన్ డిజిటల్ కామర్స్, యాప్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రవీంద్ర మాట్లాడుతూ మహిళలు తయారు చేసిన వస్తువులను యాప్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. ఆన్‌లైన్‌లో వచ్చిన ఆర్డర్‌లను ప్యాకింగ్ చేసే విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో ఏఎస్‌డీసీ యాంకర్ పర్సన్ డీ.సురేష్, ఏసీఎం రవి, ఏపీఎంఎస్ సీసీలు పాల్గొన్నారు.

పూత పూయదు.. పిందె కాయదు!



- అదును దాటుతున్నా మామిడిలో కనిపించని పూత, పిందె
- పది శాతం మాత్రమే తోటల్లో కనిపిస్తున్న వైనం
- వాతావరణం అనుకూలంగా ఉన్నా తగ్గుతున్న దిగుబడులు
- అధిక తేమశాతం కారణం అంటున్న ఉద్యాన అధికారులు

జే.పంగులూరు: వేసవి రాగానే ఒక పక్క ఎండలు గుర్తొస్తే.. మరోపక్క మామిడి గుర్తొస్తుంది. వేసవిలో మామిడి పండు తినని వ్యక్తి ఉండడంటే ఆశ్చర్యం వేయక మానదు. కాని అద్దంకి నియోజకవర్గంలో మాత్రం మామిడి తోటలు సరైన పూత, పిందెలు రాక రైతన్నలు ఆందోళనలో ఉన్నారు. అదును దాటుతున్నప్పటికీ మామిడి తోటల్లో పూత, పిందెలు పెద్దగా రావడం లేదు. సాధారణంగా డిసెంబర్, జనవరి నెలల్లో మామిడి తోటల్లో పూత రావాల్సి ఉంది. మండలంలో సుమారు 500 ఎకరాల్లో మామిడి తోటలు ఉన్నాయి. వాతావరణం అనుకూలంగానే ఉంది. మామిడి తోటలు పూత, పిందెలతో నిండి కళకళలాడాల్సి ఉంది. కాని ఈసారి ఐదు నుంచి పది శాతం తోటల్లోనే పూతలు, పిందెలు కనిపిస్తున్నాయి.

కొంపముంచుతున్న తేమశాతం..

అద్దంకి నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో ఇంచుమించు 700 నుంచి 800 ఎకరాల వరకు మామిడి తోటలు ఉన్నాయి. డిసెంబర్‌లో రెండు శాతం తోటల్లోనే పూతలు రాగా ప్రస్తుతం ఇప్పుడు మరికొన్ని తోటల్లో పూతలు, పిందెలు వస్తున్నాయి. తేమశాతం ఎక్కువగా ఉండటం వలన కూడా చెట్టు పచ్చగా ఆకులతో కప్పుకొని ఉన్న పూత, పిందె మాత్రం తగ్గుతోంది. పంగులూరు మండలంలోని బూదవాడ, ముప్పవరం, కొండమంజులూరు, బైటమంజులూరు మామిడి తోటలు ఉన్నాయి. తోటల్లో పూత, పిందె సరిగా రాకపోవడంతో రైతుల్లో నైరాశ్యం ఆవరించింది.



పంగులూరులో పూత, పిందె కనిపించని మామిడి తోట

ఆలస్యంగా పూత వస్తే.. దిగుబడి తగ్గే అవకాశం..

ప్రస్తుతం ఇప్పుడు పూత సరిగా రాకపోయిన మార్చి, ఏప్రిల్ నెలల్లో ఎక్కువగా పూత వచ్చే అవకాశం కూడా లేకపోలేదు. ఆలస్యంగా వచ్చే పూత వలన మామిడి కాయలు దిగుబడి నామమాత్రంగానే ఉంటుంది. సాధారణంగా ఫిబ్రవరి రెండో వారంలో ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. ఉష్ణోగ్రత పెరిగే కొద్ది వచ్చిన పిందెల్లో మామిడి పూతలు నిలబడవు. కొద్దిగా పిందెలు నిలబడినప్పటికీ కాయలు పరిమాణం తక్కువగానే ఉంటాయి. ఈసారి ఇలాంటి గడ్డు పరిస్థితి మామిడి తోటల్లో స్పష్టంగా కనిపిస్తోంది. నిజానికి గత నాలుగేళ్లుగా మామిడి తోటలు ప్రతికూల వాతావరణాన్ని ఎదుర్కొంటున్నాయి. రాత్రి ఉష్ణోగ్రతలు తక్కువ ఉంటే మామిడి పూతలు రావడానికి అనుకూల వాతావరణం. ఉష్ణోగ్రతలు తక్కువగా ఉండటం వలన రాత్రి ఉష్ణోగ్రతలు మామిడి చెట్లకు అనుకూలంగా రావడం లేదు. ప్రతికూల వాతావరణం వలన ఏటా మామిడి పూత ఆలస్యంగా వస్తోంది. గత సీజన్‌లో మామిడి పూత 15 శాతానికి తగ్గింది. ఈసారి సకాలంలో పూత పూసిన తోటల్లో విస్తీర్ణం పదిశాతం లోపే అని రైతులు చెప్తున్నారు.



పూత సరిగాలేని మామిడి చెట్టు

> **చూద్దాం అంటే పూత కనిపించడం లేదు..**
>
> నేను 30 సంవత్సరాల నుంచి మామిడి తోటలను కాపాడుతూ వస్తున్నాను. గతేడాది మామిడి తోటలో మంచి దిగుబడి వచ్చింది. మామిడి ఒక ఏడాది దిగుబడి బాగా వస్తే మరుసటి ఏడాది తగ్గుతుంది. దానికి తోడు భూమిలో తేమ ఎక్కువగా ఉండటం వలన కూడా పూత సక్రమంగా రావు. ఈ ఏడాది వర్షాలు అధికంగా పడటంతో భూమిలో తేమ శాతం ఎక్కువగా ఉంది. అదును దాటి పూత వచ్చినా కాయ సైజు రాదు.
>
> – రామారావు మామిడి రైతు, ముప్పవరం

పడగొట్టరు.. పట్టించుకోరు!



శిథిలావస్థలో మూలగానివారిపాలెం ప్రాథమిక పాఠశాల భవనం



భవనంలో పడేసిన మద్యం సీసాలు

- శిథిలావస్థలో మూలగానివారిపాలెం పాఠశాల భవనం
- అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా శిథిల భవనం
- రాత్రయితే చాలు మద్యం బాబులకు అడ్డాగా పాఠశాల ఆవరణ

చినగంజాం: పాఠశాల భవనం ఎప్పుడో శిథిలావస్థకు చేరింది.. ఎప్పుడు కూలుతుందో చెప్పలేని పరిస్థితి. భవనం పూర్తిగా పాడైపోవడంతో తరగతులు సైతం నిర్వహించుకోలేని దుస్థితిలో దానిని పూర్తిగా ఖాళీ చేసేశారు. అలాంటి భవనాన్ని కూల్చివేయకపోవడంతో విద్యార్థులు భయాందోళన చెందుతున్నారు. అదే ఆవరణలో పక్క భవనంలో పాఠశాల నిర్వహిస్తున్నారు. మండలంలోని కొత్తపాలెం పంచాయతీ మూలగానివారిపాలెం గ్రామ పరిధిలోని మండల ప్రాథమిక పాఠశాల భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరింది.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డగా..

శిథిలభవనాన్ని కూల్చి వేయకుండా అలాగే ఉంచడంతో అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది. పాఠశాల గదులు జులాయిలకు ఆవాసాలుగా మారుతున్నాయి. ముఖ్యంగా రాత్రి వేళ పాఠశాల భవనాన్ని పలు చర్యలకు వాడుతున్నారు. రాత్రయితే చాలు మందుబాబులు అడ్డాగా భవనం నిలుస్తుంది. ఎంతో పవిత్రంగా ఉంచాల్సిన పాఠశాల ఆవరణాన్ని అపవిత్రం చేస్తున్నారు. పాఠశాల దుస్థితిని చూసి పలువురు తల్లిదండ్రులు పిల్లలను బడికి పంపించేందుకు కూడా అయిష్టత కనబరుస్తున్నారు. ఉపాధ్యాయులు తమ ప్రభుత్వ పాఠశాలలో అన్ని సౌకర్యాలు కల్పిస్తాన్నామంటూ ఇంటింటికి తిరిగి చెప్తున్నప్పటికీ ఫలితం లేకుండా పోతుంది. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పూర్తిగా తగ్గిపోయే పరిస్థితి తలెత్తింది.

> ఈ విషయమై విద్యాశాఖాధికారులను సాక్షి వివరణ కోరగా పాఠశాల భవనం కూల్చి వేత విషయమై పంచాయతీ రాజ్ ఏఈ తెలియజేశామని, వారు ఈఈ దృష్టికి సమస్యను తీసుకెళ్లాల్సిందిగా సూచించారన్నారు. పంచాయతీ రాజ్ ఏఈ దానుకు సమస్యను తీసుకొని వెళ్లగా ఈఈ ఆదేశాలు ఇస్తేనే ప్రభుత్వ భవనాన్ని కూల్చి వేసేందుకు తమకు అవకాశం ఉంటుందని తెలిపారు.

> **పాఠశాల శిథిల భవనాన్ని వెంటనే కూల్చివేయాలి..**
>
> 
>
> పాఠశాల ఆవరణలో విద్యార్థులకు అసౌకర్యంగా ఉన్న శిథిల భవనాన్ని తక్షణం కూల్చివేయాలి. అందుకు అధికారులు సత్వరం చర్యలు తీసుకోవాలి. అంతటి అపరిశుభ్ర వాతావరణంలో విద్యార్థులు బడికి రావాలంటే చాలా కష్టంగా ఉంది.
>
> – అక్కల రామకృష్ణారెడ్డి, రిటైర్డ్ ఉపాధ్యాయుడు

భయపడుతున్న విద్యార్థులు

అపరిశుభ్రమైన పరిసరాలలో విద్యార్థులు విద్యనభ్యసించేందుకు విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. మధ్యాహ్న భోజనం కూడా అక్కడే చేయాల్సి రావడంతో వారు అవస్థలు ఎదుర్కొంటున్నారు. శిథిల భవనంలో అపరిశుభ్రత కారణంగా దుర్వాసన వస్తుండటంతో విద్యార్థులు ఇబ్బంది పడటమే కాక తల్లిదండ్రులు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు.

ఉల్లాస్‌తో వయోజనులకు విద్య



పొదుపు సంఘాల లీడర్లు, యానిమేటర్లకు సూచనలందిస్తున్న పర్యవేక్షకుడు

చీరాల టౌన్: పొదుపు మహిళలు నిరక్షరాస్యులను వయోజన కేంద్రాలకు పంపించి చదువుకునేలా చేయాలని వయోజన విద్యాశాఖ పర్యవేక్షకుడు కే.మనోరంజన్ సూచించారు. శుక్రవారం డీఆర్‌డీఏ వెలుగు కార్యాలయంలో 'నవభారత్ సాక్షరతా కార్యక్రమం, ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసీ అసెస్‌మెంట్ టెస్ట్' కార్యక్రమంపై స్వయం సహాయక బృందాలకు సమావేశం నిర్వహించారు. వెలుగు ఏపీఎం మధుసూదనరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మనోరంజన్ మాట్లాడుతూ.. చదువురాని 15 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరికి ఉల్లాస్ ద్వారా చదవడం, రాయడంతో వయోజన విద్యనందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా విద్యా కేంద్రాలను నిర్వహిస్తుందన్నారు. మండలంలో ఉన్న స్వయం సహాయక సంఘాలలో మొదటి విడతగా 520 మందికి వయోజన విద్యా కేంద్రాల ద్వారా విద్యనందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈనెల 23న ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్లాంట్ టెస్ట్‌ను నిర్వహిస్తున్నామని చదువురాని వారు, చదువును మధ్యలో ఆపేసిన వారిని పరీక్ష కేంద్రానికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం మధుసూదనరావు, సీసీలు, యానిమేటర్లు, సిబ్బంది ఉన్నారు.

అక్షరాస్యతా కేంద్రాలు వినియోగించుకోవాలి..

వేటపాలెం: చదువు నేర్చుకోవాలను కునే మహిళలు ఉల్లాస్ అక్షరాస్యతా కేంద్రాలను సద్వినియోగంచుకోవాలని విద్యాశాఖ పర్యవేక్షకుడు కొణిదల మనోరంజన్ సూచించారు. స్థానిక వెలుగు కార్యాలయంలో వయోజన విద్యపై సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీఎం కే అంజిబాబు, ఎఈఓ సుబ్బయ్య, సీడీపీ ఝాన్సీ, వెలుగు సీసీలు, యానిమేటర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.

సాహితీవేత్త శ్రీరామచంద్రమూర్తికి సన్మానం



శ్రీరామచంద్రమూర్తి రెడ్డిని సత్కరిస్తున్న ప్రిన్సిపాల్, సిబ్బంది

చినగంజాం: కవితా దినోత్సవం పురస్కరించుకొని సాహితీవేత్త కుక్కల శ్రీరామచంద్రమూర్తి రెడ్డిని సత్కరించారు. శుక్రవారం వేటపాలెం మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలో శుక్రవారం కవితా దినోత్సవం సందర్భంగా ఆయనను ఘనంగా సత్కరించారు. కొత్తపాలెం పంచాయతీ మూలగానివారిపాలేనికికు చెందిన ఆయన విద్యార్థులకు, బోధన, బోధనేతర సిబ్బందికి తెలుగు సాహిత్యంలోని గొప్పతనాన్ని గురించి వివరించారు. అనంతరం శ్రీరామచంద్రమూర్తి రెడ్డిని ప్రిన్సిపాల్ నారాయణస్వామి శాలువా కప్పి జ్ఞాపికను అందజేశారు.

జాతీయ సెమినార్‌లో సెయింట్ ఆన్స్ విద్యార్థుల ప్రతిభ



బహుమతులు పొందిన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

వేటపాలెం: జాతీయ సెమినార్ పోటీల్లో సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ విద్యార్థులు ప్రతిభ చాటారు. ఇటీవల ఆచార్య నాగార్జున యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఫార్మా సూటికల్ సైన్సెస్ యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ జాతీయ స్థాయిలో సెమినార్ నిర్వహించిందని కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ ఎస్ లక్ష్మణరావు శుక్రవారం తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. 'రీసెంట్ అడ్వాన్స్‌మెంట్స్ ఆన్ సాఫ్ట్‌వేర్ బేస్డ్ అప్రోచెస్ ఇన్ ఫార్మసూటికల్ రీసెర్చ్'లో సెమినార్ నిర్వహించారన్నారు. పోటీల్లో ప్రథమ స్థానం సాధించారని తెలిపారు. పోటీలకు వివిధ రాష్ట్రాల నుంచి 600 మంది ఫార్మసీ విద్యార్థులు పాల్గొన్నారని ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు చెప్పారు. వందకు పైగా సమర్పించిన పోస్టర్ ప్రజెంటేషన్స్‌లో మూడో సంవత్సరం విద్యార్థులు పీ పావనికి మొదటి బహుమతి, బీ దివ్యశ్రీకి రెండో బహుమతి, వీరితో పాటు పీ దివ్యశ్రీ, ఎస్కే హసీనాలకు బహుమతి లభించినట్లు తెలిపారు. ఈసందర్భంగా శుక్రవారం విద్యార్థులను కళాశాల అధ్యాపకులు అభినందించారు.

అష్టలక్ష్మి దేవాలయానికి విరాళం



ఆలయ అభివృద్ధి కమిటీకి నగదు అందజేస్తున్న దాత రమేష్

పర్చూరు(చినగంజాం): పర్చూరులోని అష్టలక్ష్మి దేవాలయ నిర్మాణానికి పర్చూరుకు చెందిన తాడి రమేష్‌బాబు రూ.1.25 లక్షలు విరాళం అందించారు. ప్రస్తుతం ఆయన ఉద్యోగ రీత్యా చెన్నై నివాసం ఉంటుండగా స్వగ్రామంలో నిర్మిస్తున్న దేవాలయానికి విరాళం అందజేశారు. శుక్రవారం విరాళంగా ఇచ్చిన నగదును ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు కోట శ్రీనివాసరావు, పాటోలు సత్యనారాయణ, లక్ష్మీనారాయణ, సింహదాటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఎండల దృష్ట్యా జాగ్రత్తలు తప్పనిసరి

బల్లికురవ: ఎండలు రోజురోజుకూ పెరుగుతున్నందున ప్రజలు తగు జాగ్రత్తలతో ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని గుంటుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి షేక్ రమీజ్ అహమ్మద్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. అత్యవసరమైతేనే బయటకు రావాలన్నారు. మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 4 గంటల మధ్య తలకు టోపి, గొడుగుతో బయటకు రావాలని శీతల పానీయాలు, ఐస్ ముక్కలు తీసుకొవద్దన్నారు. చల్లని మంచినీరు, నిమ్మరసం, కొబ్బరి నీరు, పుచ్చకాయ తీసుకోవాలన్నారు. వడదెబ్బకు గురైతే వైద్యశాలకు వచ్చి చికిత్స చేయించుకొవాలని, ఉప్పు కలిపిన మజ్జిగ, గ్లూకోజ్ తాగించాలని వైద్యాధికారి కోరారు.

కనిగిరి హెచ్‌ఎంపై అక్రమ కేసు దారుణం

కారంచేడు: ప్రకాశం జిల్లా కనిగిరి బాలికోన్నత పాఠశాల హెచ్‌ఎం కే విజయలక్ష్మిపై పోలీసులు కేసు నమోదు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని యూటీఎఫ్ నాయకులు అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైం కారంచేడు యూటీఎఫ్ కార్యాలయం వద్ద విలేకర్లతో మాట్లాడారు. యూటీఎఫ్ స్టేట్ కౌన్సిల్ మెంబర్ భవనం శ్రీనివాసరెడ్డి, మండల శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శ్రీనివాసులు, రమేష్‌రెడ్డిలు మాట్లాడుతూ కనిగిరి బాలికల ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు బాలికలపై అనుచితంగా ప్రవర్తించడం, లైంగిక వేధింపులకు గురిచేశాడన్నారు. ఈవిషయాన్ని పాఠశాల హెచ్‌ఎం విజయలక్ష్మి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో ఆయనపై విద్యాశాఖ ఉన్నతాధికారులు ఆయనపై చర్యలు తీసుకున్నారన్నారు. అయినప్పటికీ పోలీసులు విజయలక్ష్మిపైనా కేసు నమోదు చేయడంతో పాటు, బుర్కా వేసుకొని వచ్చిన కొందరు పోలీసుల సమక్షంలోనే ఆమెపై దాడి కూడా చేయడం హేయమన్నారు. ఆమె మెడలోని బంగారు గొలుసును సైతం దొంగిలించారాన్నారు. చర్యలకు పాల్పడిన వారిని గుర్తించి వారిని కఠినంగా శిక్షించాలని, ఆమెపై ఉన్న అక్రమ కేసును ఉపసంహరించుకోవాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండల శాఖ కార్యదర్శి పావులూరి శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి రావి పద్మావతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పదో తరగతి ఇంగ్లిష్ పరీక్ష

ఇంకొల్లు(చినగంజాం): మండలంలో పదో తరగచతి పబ్లిక్ పరీక్షలకు సంబంధించి మూడో రోజు శుక్రవారం ఇంగ్లిషు పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. మండలంలోని మొత్తం 6 పరీక్ష కేంద్రాలలో 793 మంది పరీక్ష రాయాల్సి ఉండగా మూడో రోజు పరీక్షకు ఐదుగురు గైర్హాజరయ్యారు. ఈ మేరకు మండల విద్యాశాఖాధికారి బీ అజయ్‌బాబు సమాచారమిచ్చారు. చినగంజాం మండలంలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సంబంధించి రెండు పరీక్ష కేంద్రాల్లో ఇంగ్లిషు పరీక్ష నిర్వహించారు. చినగంజాం, కడవకుదురు జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పరీక్షకు సంబంధించి మొత్తం 417 మంది విద్యార్థులకు గాను ముగ్గురు గైర్హాజరు కావడంతో 414 మంది మాత్రమే పరీక్షకు హాజరైనట్లు ఎంఈఓ తెలిపారు. పర్చూరు మండలంలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు మూడో రోజు శుక్రవారం నిర్వహించిన పరీక్షకు 672 మందికి గాను 16 మంది గైర్హాజరు కాగా కేవలం 656 మాత్రమే పరీక్షకు హాజరయ్యారు. మొత్తం మండలంలో నాలుగు పరీక్ష కేంద్రాల్లో పరీక్ష నిర్వహించారు. మండల విద్యాశాఖాధికారి ఎంవీ సత్యనారాయణ సమాచారమిచ్చారు.

కేజీబీవీలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

బల్లికురవ: మండల కేంద్రంలోని కేజీబీవీలో 2025-26 విద్యా సంవత్సరానికి 6వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో చేరేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని విద్యాలయ ప్రిన్సిపాల్ కె. సరళకుమారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వీటితోపాటు 9, 10వ తరగతి, ఇంటర్మీడియట్ రెండో సంవత్సరంలో మిగిలిన సీట్లకు ఏప్రిల్ 11వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఇంటర్మీడియట్ ఎంఈసీ గ్రూపునకు మాత్రమే ప్రవేశాన్ని కల్పిస్తున్నట్లు చెప్పారు. అనాథలు, బడిబయట ఉన్న డ్రాపౌట్స్ ఎస్సీ, ఎస్టీ, బీసీ, బీపీఎల్ బాలికలు మాత్రమే అర్హులని, మరిన్ని వివరాలకు విద్యాలయంలో కాని, 91103 69460 నంబర్‌ను సంప్రదించవచ్చని ప్రిన్సిపాల్ కోరారు.